"ఇదేమిటండీ. ఎలాకట్టుకోను. మాకు వాడు చూపించిన చీర 5 మీటర్లువుందే. మిగతా చీరలన్నీ ఒకటేనని పమ్మల్ని కవర్లలోంచి తియ్యనియ్యలేదు. ఇలాఅని తెలిస్తే వాడు చూపించినదే తీసుకునేదాన్ని" బిక్కమొగం వేసింది శ్రీమతి.

"డియర్, వీధిలోకి మూటలు తెచ్చేవాళ్ళు చవగ్గా ఇస్తారంటే ఎందుకు ఇస్తారనుకున్నావ్....3 1/2 మీటర్లు చీర ఎనభయి రూపాయలకు ఇచ్చాడు. ఏ రాయి అయితేనేం? పైగా ఈ చీర "సెకండ్స్" అంటే ఫ్యాక్టరీలో ఏదో ఒక లోపం వున్న చీరలు ఇలా ముద్రవేసి గుట్టగాపోసి చౌకగా అమ్ముతారు. కాని ఒక్కోసారి మంచివికూడా దొరుకుతాయి. అయినా నెలాఖరులో నీకు డబ్బు ఎక్కడిది?" అడిగాను.

శ్రీమతి ఇంకా చిన్నబోయిన ముఖంతో—

"మొన్న మీ కథకి వంద రూపాయలు వచ్చాయికదా. అవి ఖర్చు పెట్టద్దని చెప్పారుకూడా. అయినా తీసేను.".

షాక్ తినడం ఈసారి నావంతయింది.

—o—

# ధర్మ సందేహం

మానవ శరీరం ఎంత చిత్రమైంది. శరీరంలో ఏ భాగం పనిచేయక పోయినా మనం ఎందుకు పనికిరాము. కనీసం చిటికెనవ్రేలు తెగిందంటే మిగతా చేతివ్రేళ్ళతో పనిచేయలేము.

నాకు గత పదిహేను రోజులనుండి ఛాతీలో నెప్పివస్తోంది. నాకు తెలిసిన మాత్రలు వేసుకుని కాలక్షేపం చేస్తున్నాను. కాని నొప్పి కంట్రోల్ అవలేదు. ఇక లాభంలేదు డాక్టర్ని సంప్రదించాలి అనుకుని డాక్టర్ దగ్గరకు బయలుదేరాను.

మా బాబు నావెంట బయలుదేరాడు. ఆఫీసుకు వెళ్ళేటప్పుడు తప్పించి, మిగతా సందర్భాలలో నన్ను వాడు వదలివుండడు. అక్కడికీ ఇంజెక్షన్ చేస్తారని బెదిరించాను కూడా వినలేదు.

డాక్టర్‌గారి దగ్గరకు చేరేము. ఆయన తీరికగానే వున్నారు. "నమస్కారం సార్" అన్నాను. "రండి. రండి. ఏమిటి సంగతి" అన్నా రాయన. ఆయన చేతిలో సిగరెట్ కాలుతూంది.

చెప్పాను గత పదిహేను రోజులనుంచి ఛాతీలో నెప్పి వస్తోందని, వాడిన మాత్రలు వివరాలు అన్నీ. స్టెతోతో ఛాతీమీద, వీపుమీద పరీక్ష చేశారు. జ్వరం చూశారు. ఈలోగా ఆయన మరొక సిగరెట్ వెలిగించేరు.

మా చంటాడు డాక్టరుగారి ప్రక్కనే నిలబడి ఆయన సిగరెట్‌పొగ ఎలా వదులుతున్నారో చూస్తున్నాడు వింతగా.

వాడికి సిగరెట్లు కాల్చడమంటే బలే సరదా. పొగ వదలడమంటే మరీ సరదా. "నేను పెద్దయ్యాకసిగరెట్ కాలుస్తా" అనిఇప్పుడే "డిక్లేర్" చేశాడు వాడు. అందుకని, నేనువాడికి కనపడకుండా సిగరెట్లు కాలుస్తుంటాను.

"అయితే మీ అలవాట్లు చెప్పండి" అన్నారాయన.

"ప్రొద్దున్నే రెండుసార్లు కాఫీ, టిఫిను, మధ్యాహ్నం భోజనం, ఈలోగా రెండు మూడుసార్లు కాఫీ, రోజుకు రెండు లేక మూడు పేకెట్ల సిగరెట్లు, వక్కపొడి" అన్నాను.

"చాలు మీరు వెంటనే సిగరెట్లు, కాఫీ, వక్కపొడి మానెయ్యాలి. తెలిసిందా? రోగ నిర్ణయం జరిగేక మిగతా పథ్యం చెబుతాను. రేపు ఉదయం రక్తం, ఉమ్మి వగైరాలు పరీక్ష చేస్తాను" అన్నారు ఆయన. ఈలోగా ఆయన మరో రెండు సిగరెట్లు కాల్చేరు.

"మరి వస్తాను సార్" అని లేచేను.

"డాక్టరుగారూ" అన్నాడు మా చంటాడు.

"ఏమిటి బాబూ నీకూ మందు కావాలా" అన్నారు బాబు బుగ్గ గిల్లుతూ ముద్దుగా.

"మా నాన్నగార్ని సిగరెట్లు మానెయ్యమన్నారు కదా, మరి మీరు ఇందాకటినుంచి ఆరు సిగరెట్లు కాల్చేరు కదా. ఇలా అయితే రోజుకు ఎన్ని కాలుస్తారు?'' మీకు జబ్బు చెయ్యదా?'' అని గడగడా వాగేస్తున్నాడు వాడు.

"తప్పు బాబూ అలా అనకూడదు'' అని వారించేను వాడిని.

డాక్టరుగారి ముఖం తెల్లకాగితం అయింది.

....o....

# అప్పగింతలు

ప్రతి సంవత్సరంలాగానే పిల్లలకు పెద్ద పరీక్షలు అయిపోయాయి. వేసవి శలవులు ఇచ్చేశారు. ఎండలు కాస్తున్నాయి. సుమ పిల్లల్ని వెంట బెట్టుకుని తన పుట్టింటికి వేసవి విడిదికి బయలుదేరింది.

తను చేసే ఉద్యోగానికి శెలవులు ఉండవు కాబట్టి సుబ్బారావు మామూలుగా ప్రతి సంవత్సరం తన భార్య పిల్లలు ఊరు వెళ్ళినప్పుడు వండుకుని తింటాడు.

ఆ రోజు వాళ్ళని బస్ ఎక్కించడానికి వచ్చాడు. బస్సు వచ్చింది. అందులో, తన భార్యని, పిల్లల్ని సౌకర్యంగా కూర్చోబెట్టాడు.

ఇక అప్పగింతల కార్యక్రమం మొదలయింది.

"పెద్దదానికి మామిడిపళ్ళు తింటే పడదు. దానికి ఇష్టంకదాఅని ఒకటే పెట్టమాక.''

"రెండవవాడికి హార్లిక్స్ లేకపోతే వుండలేడు. నీ దగ్గరవున్న హార్లిక్స్ అయిపోతే నేను ఇచ్చిన డబ్బుతో మళ్ళీ ఒక బాటిల్ తెప్పించుకో.''

"చంటాడు ఎండలో తిరుగుతాడు జాగ్రత్త. వాడు నీ మాట వినడు. ఒకవేళ బెంగపెట్టుకుని జ్వరంవస్తే ట్రంకాల్ చెయ్యి వచ్చేస్తాను.''

"నువ్వు నీరసంగా వున్నావు. నేను కొనిచ్చిన మాత్రలు రోజు